లోక్ అదాలత్‌లో అర్హులందరికీ న్యాయం

- ఏడీజే మురళీకృష్ణ
- రాజంపేటలో 290, నందలూరులో 464 కేసులు పరిష్కారం


రాజంపేటలో మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్న మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మురళీకృష్ణ


లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్న సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి శారద

రాజంపేట : అర్హులందరికి న్యాయం అందించడమే లోక్‌అదాలత్ లక్ష్యమని మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ అన్నారు. శనివారం రాజంపేట కోర్టు క్లాంప్లెక్స్‌లో మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏర్పడిన ప్రజాన్యాయస్థానం కుల, మత, వర్గ పేద ధనిక వర్గాల తారతమ్యంలేకుండా అర్హులైన వారికి న్యాయం అందజేస్తుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి మాట్లాడుతూ న్యాయ సహాయం చేసే విషయంలో పేదవారికి కోర్టు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జానీ ,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏజీపీ గురుప్రతాప్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కృష్ణకుమార్, శోభారాణి, మోహన్‌బాబు, రమణ, రమేష్, సుదర్శన్, శ్రీను, సురేంద్ర, జబీనాతాజ్, కోర్టు సిబ్బంది మధు, చెంద్రాయుడు, సాల్మన్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 290 కేసులకుగాను రూ.2కోట్ల నగదు పరిష్కరించారు.

నందలూరులో 464 కేసులు పరిష్కారం

నందలూరు కోర్టులో జడ్జి లత ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో 464 కేసులు పరిష్కరించారు. రూ.25,86,314 నగదు వసూలైంది. కార్యక్రమంలో నందలూరు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, లోక్‌అదాలత్ సభ్యులు ఫైజుల్లాఖాన్‌లోడి, ఆనంద్‌కుమార్, న్యాయవాదులు ఏవీ సుబ్రమణ్యం, కృష్ణారెడ్డి, షేక్, సుబ్బరామయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు జడ్జి లత నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో రూరల్ సీఐ పుల్లయ్య, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, పెనగలూరు, నందలూరు ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

141 కేసులు పరిష్కారం

– జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకల్యాణ్

సిద్దవటం : జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో 141 కేసులు పరిష్కరించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకల్యాణ్ అన్నారు. సిద్దవటం కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం పోలీసుస్టేషన్, అట్లూరు, ఒంటిమిట్ట పోలీసుస్టేషన్ల పరిధిలోని క్రిమినల్ కేసులు 10, సివిల్ కేసులు 40, ప్రీ లిటిగేషన్ కేసులు 27, సమ్మర్ ట్రైల్ కేసులు 64, మొత్తం 141 కేసులను పరిష్కరించామని తెలిపారు. అంతేగాకుండా సివిల్ కేసుల్లో సెటిల్‌మెంటు మొత్తం రూ. 9,800, ప్రీ లిటిగేషన్ కేసుల్లో సెటిల్‌మెంటు మొత్తం రూ.8,40,000 , సమ్మర్ ట్రైల్ కేసుల్లో సెటిల్ మెంటు మొత్తం రూ. 20,200 కలిపి మొత్తం రూ. 8, 70,000 వచ్చిదన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అయితే అది రాజమార్గమే అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ తాజుద్దీన్, న్యాయవాదులు బి. వెంకటరత్నం, రామదాసు, రాఘవ, సుధామణి, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

– జూనియర్ సివిల్ జడ్జి శారద

లక్కిరెడ్డిపల్లి : రాజీ మార్గమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి శారద పేర్కొన్నారు. శనివారం స్థానిక లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 235 కేసులు పరిష్కారమై రూ. 8,46,850లు వసూలయ్యాయని కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చెన్న కృష్ణయ్య, బాలాజీ రెడ్డి, సీఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్, రామాపురం, గాలివీడు పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీలకు లోక్‌అదాలత్ సరైన మార్గం

రాయచోటిటౌన్ : ఎలాంటి సమస్యకు అయినా రాజీ ద్వారా పరిష్కారం లభిస్తుందని 5వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి కృష్ణ కుట్టి అన్నారు. శనివారం రాయచోటి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాయచోటి నియోజక వర్గ పరిధిలోని మొత్తం పోలీస్ స్టేషన్‌లలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మొత్తం 593 కేసులను పరిష్కరించారు. ఈ కేసులలో భాగంగా బాధితులకు మొత్తం రూ. 10,37,023 చెల్లించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం ఫాతిమా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె. శారద, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అజాత శత్రువు పండిట్ దీన్‌దయాల్


దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : బీజేపీ సిద్ధాంతకర్త, జనసంఘ్ మాజీ జాతీయ అధ్యక్షుడు దివంగత పండిట్ దీన్‌దయాల్ అజాతశత్రువు అని భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ నియోజవర్గ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం దీన్‌దయాల్ వర్ధంతిని నిర్వహించారు. తొలుత బీజేపీ నాయకులు దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, జీకే నాగరాజు, తోట నగేష్, .సుభద్ర, గాదెల శ్రీనివాసులు, సూర్యచంద్ర, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లెలో ఉన్న శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వలంటీర్ మృతికి నివాళి

రామాపురం : మండల కేంద్రంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న గువ్వల నాగరాణి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మృతురాలి స్వగృహానికి చేరుకొని ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వలంటీర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ, సర్పంచ్ నాగభూషన్ రెడ్డి, సత్యయాదవ్, సుకుమార్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి తదితరులు

పెనగలూరు : మండలంలోని మూగవారిపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలు మధ్య గ్రామంలోని మహిళలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజల అనంతరం అందరికీ తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలస్వామి



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో వెలసిఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. శనివారం గ్రామస్తులు స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు.

సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లి : సంక్షేమాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అడుగులు వేస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం గున్నికుంట్ల పంచాయతీలోని ఆవులవాండ్లపల్లె, గున్నికుంట్ల కస్బా, బలిజపల్లె, శ్రీరామ్‌నగర్, చెరువుముందపల్లె, కత్తివాండ్లపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలతో పాటు సమాజంలో అభివృద్ధిని చేసి చూపారన్నారు. శిశువు నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరి సంతృప్తి స్థాయి పెరగడం జగనన్న పాలనకు నిదర్శనం అన్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కవిత, శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన

ప్రభుత్వ విప్ కొరముట్ల


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం తెలిపారు. మండలంలోని శెట్టిగుంట సచివాలయం 1 పరిధిలో ఎస్టీకాలనీలో అన్నిశాఖల అధికారులు, స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం ఎన్నికలలో ఇచ్చిన నవరత్నాల హామీనే కాకుండా అనేక పథకాలు ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి గడపలోనూ జగనన్న ప్రభుత్వ పథకాలు అందుకుంటూ ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తూ నేరుగా వారి అకౌంట్లలోకే నగదు వేస్తూ మహిళలకు ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.

అప్పటికప్పుడు సమస్యల పరిష్కారం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తూ పలు సమస్యలు అప్పటికప్పుడు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుధాకర్‌రాజు, నాయకులు అంబటి మురళి, సీహెచ్ రమేష్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఘనంగా బ్రహ్మోత్సవాలు


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల అధికారులు, భక్తులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహణపై ఆలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చే వేలాది భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శంకరయ్య, ఆలయ వేదపండితుడు రాచరాయ యోగీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎగువభద్ర ప్రాజెక్టును నిలుపుదల చేయాలి


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకుడు జతిన్, తదితరులు

చిట్వేలి : ఎగువభద్ర ప్రాజెక్టు వలన రాయలసీమలో కరువు తాండవిస్తుందని, వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైతు సంఘం నాయకుడు మలిశెట్టి జతిన్ డిమాండ్ చేశారు. శనివారం వెంకట్రాజుపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ప్రజలను, రైతులను మభ్యపెట్టేందుకు ఎగువప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించి రూ. 5300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. ఎగువ ప్రాజెక్టు నిర్మాణం వలన శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద నీరు చేరదని, అలాగే గాలేరు, నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ ప్రాజెక్టులకు నీరు అందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మలిశెట్టి వెంకటయ్య, చలపతి, సత్యం, రాజేష్, చెంగల్ రాయులు, రెడ్డిబాబు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వ్యాపారులు

- విద్యా సంస్థల సమీపంలో జోరుగా సిగరెట్ల విక్రయాలు
- ధూమపానానికి అలవాటుపడుతున్న విద్యార్థులు
- హెచ్చరికలను సైతం పట్టించుకోని వ్యాపారులు



టొబాకో విక్రయాలు జరిపితే జరిమానా విధిస్తామని ఏర్పాటు చేసిన బోర్డు

రాజంపేట టౌన్ : విద్యా సంస్థలకు రెండువందల మీటర్ల లోపు సిగిరెట్లు, బీడీలు వంటి విక్రయాలు జరపకూడదన్న నిబంధనలు ఉన్నాయి. అయితే స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల సమీపంలో యాభైమీటర్లలోపే పలువురు తినుబండారాలకు సంబంధించి దుకాణాలను పెట్టుకొని ఉన్నారు. వీరిలో కొంతమంది సిగిరెట్లను కూడా విక్రయిస్తున్నారు. దీంతో ఇంటర్, తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులు సైతం ఇంటర్వెల్ సమయంలో అక్కడి దుకాణాల చాటుకు వెళ్లి సిగరెట్లను కాల్చుతున్నారు. కొన్ని నెలల క్రితం కొద్దిమంది విద్యార్థులు సిగరెట్లు కాల్చుతున్నట్లు ఉపాధ్యాయులు గుర్తించి వారికి హితబోధ చేసి, విషయాన్ని వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే విద్యార్థులు సిగరెట్లు కాల్చే అలవాటు మానుకోక పోవడంతో ఉపాధ్యాయులు కూడా చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. ప్రస్తుతం అనేక మంది విద్యార్థులు ధూమపానానికి అలవాటు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం రఘునాథరాజు సిగరెట్లను విక్రయించే వ్యాపారులను పిలిచి నిబంధనల మేరకు విద్యా సంస్థలకు సమీపంలో సిగరెట్లు, బీడీలు వంటివి విక్రయించరాదని, అలా విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. అయినా కూడా వ్యాపారుల్లో మాత్రం మార్పు రాలేదు. ఇదిలావుంటే ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలకు కొద్ది దూరంలోనే బీసీ, ఎస్సీ బాలుర హాస్టల్స్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా ఉంది. హాస్టల్ విద్యార్థులు, ప్రభుత్వ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు పొగ పీలుస్తూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అధ్యాపకులు, వసతిగృహ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా సంస్థల సమీపంలో వ్యాపారులు సిగరెట్లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

చిట్వేలి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మతోన్మాద హమారా ప్రసాద్‌ను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాటసంఘం జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, జిల్లా కమిటీ సభ్యుడు పందికాళ్ల మణిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేత హమారా ప్రసాద్ కుల అహంకారంతో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వారు ఖండించారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ, మాలమహానాడు ఐక్యవేదిక మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాగయ్య, రవీందర్, కారు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

లక్కిరెడ్డిపల్లి : మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి చక్రే నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల వారికి వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాగా వంటలు చేసిన వారిలో చింతకుంటపల్లి ఎంపీపీ పాఠశాలకు చెందిన మహబూబ్ జాన్, అనంతపురం ఎంపీపీ స్కూల్ ఓబులమ్మ, ఏపీ మోడల్ స్కూల్ ఏజెన్సీ ఆంజనేయులు బాగా వంట చేసినందుకు బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు చంద్రకళ, శశికళ, రామ్మోహన్, మల్లికార్జున, రామాంజనేయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుని ఆశయాల కోసం సేవా కార్యక్రమాలు

– ఎంఈఓ. రంగనాథయ్య


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ, సర్వేజన సేవా సమితి ప్రతినిధులు

పుల్లంపేట : పదమూడు సంవత్సరాల క్రితం మృతి చెందిన స్నేహితుడు సోమా జనార్ధన్ యాదవ్ ఆశయాలకోసం అతని మిత్ర బృందం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ రంగనాథయ్య అన్నారు. మండల పరిధిలోని టీ కమ్మపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు సర్వేజనా సేవా సమితి ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

పొద్దు తిరుగుడు పంట పరిశీలన

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీ పరిధి ఖాజీపల్లె గ్రామంలో శనివారం పొద్దుతిరుగుడు పంటను పరిశీలించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం. నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దు తిరుగుడు పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీంతో పంటలోని లేత ఆకులు ముడుచుకు పోతున్నాయని వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దీని నివారణకు డిఫెంతిసురోన్ 1.25 గ్రాములు +19:19:19, 10 గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నిమ్మకాయల వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రం, శైవక్షేత్రమైన తలకోనకు మొట్టమొదటి సారిగా శివరాత్రి రోజు 18న మదనపల్లె నుంచి తలకోనకు రెండు పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. రాను పోను చార్జీలు రూ.240 చెల్లించాలన్నారు. నిమ్మనపల్లె మండలం తవళంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయంకు 18న 5 బస్సులు, 19న 5 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కలకడ ఝరీ కోనకు 19న 15 బస్సు సర్వీసులు నడుపుతామన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయండి

పీలేరు : కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానము ఆధ్వర్యములో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. అర్చకులు కుమార్‌శాస్త్రి మాట్లాడుతూ 16న ధ్వజారోహణము, 17న రుద్రాభిషేకం, హోమాలు, రుద్రా పారాయణము, 18న స్వామివారికి ప్రత్యేకాలంకరణ ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ

మదనపల్లె సిటీ: స్థానిక పుంగనూరు రోడ్డులోని బాబా అబ్దుల్‌హుస్సేని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధోత్సవం వైభవంగా జరిగింది. ఉరుసు పురస్కరించుకుని దర్గా పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

అనంతపురం గంగమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 21, 22 తేదీలలో జరగనున్న అనంతపురం గంగమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమష్టి కృషితో జాతరను జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో కలిసి జాతర పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆలయ కమిటీకి, అధికారులకు సూచించారు. దాతలు, అన్నిశాఖల అధికారులు, స్వచ్ఛంద సేవాసంఘాల సహకారం, సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, మాజీ చైర్మన్ ఆనంద్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో ఖాతాదారులను ఆకర్షించాలి

రాయచోటి : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శనివారం రాయచోటిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీజినల్ మేనేజర్ ఆర్ రామకృష్ణ, సేల్స్ చీఫ్ మేనేజర్ సురేష్ బాబు, రాయచోటి శాఖ చీఫ్ మేనేజర్ జగదీష్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన రైతులకు, నిరుద్యోగ యువతకు రుణాలు ఇవ్వాలని కోరారు. గాలివీడు మండలంలోని నూలివీడు, సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లె, రాయచోటి మండలంలోని మాధవరం, రామాపురం మండలంలో గువ్వల చెరువు, నీలకంఠరావుపేట, లక్కిరెడ్డిపల్లె మండలంలో ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఖాతాదారులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని సూచించారు.

వేడుకగా గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

రాయచోటి : రాయచోటి పట్టణ పరిధిలోని బ్రహ్మంగారిగుట్టపై వెలసిన గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నరసింహాచారి, కమిటీ సభ్యుడు నాగాచారి తదితరుల ఆధ్వర్యంలో వేదపండితులు వేదమంత్రోచ్చరణను పఠిస్తూ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు నిత్యసత్యాలు

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కాలజ్ఞాన తత్వాలు నిత్యసత్యాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కనులపండువగా జరిగిన కల్యాణోత్సవాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మంగారి జీవనశైలి, ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ మార్గదర్శకాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, సర్పంచ్ నాగార్జునాచారి, పెద్దలు హనుమంతరావు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస గెలుపునకు కృషి చేయాలి


ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశా నిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


వెన్నపూసకు మద్దతు ప్రకటిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని ఆకేపాడులో గల ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం నియోజక వర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికలలో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమానికి సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఈ ఎన్నికలలో వెన్నపూసకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నపూస విజయం కోసం కృషిచేద్దాం

రాయచోటి అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి విజయం కోసం మున్సిపల్ కౌన్సిలర్లు అందరం కలసికట్టుగా కృషిచేద్దామని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు అన్నారు. శనివారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు సమావేశమయ్యారు. అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు జయసింహా రెడ్డి మాట్లాడుతూ విజయమే ధ్యేయంగా ప్రచారాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌లు అల్తాఫ్, ఆసిఫ్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్, రౌనఖ్ హుస్సేన్, కో– ఆప్షన్ సభ్యుడు ఆసిఫ్‌అలీఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.